
నిరసన తెలుపుతున్న మున్నూరుకాపు మహాసభ నాయకులు

మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం
ట్రస్ట్ బోర్డు చైర్మన్‌ను తొలగించాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ వెంకట్రావ్‌ను పదవి నుంచి తొలగించాలని మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. శ్రీరామనవమి వేడుకల ఏర్పాట్లను పరిశీలించడానికి కాచిగూడలో ట్రస్ట్ బోర్డు కార్యాలయానికి వెళితే ప్రధాన గేట్‌కు తాళం వేసి లోపలికి రానీయలేదని ఆయన ఆరోపించారు. దీంతో మంగళవారం ట్రస్ట్‌బోర్డు కార్యాలయం గేట్ వద్ద మహాసభ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. 22 సంవత్సరాల నుంచి సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నామని, అందరం కలిసి చేద్దామని చైర్మన్ హామీ ఇచ్చి మాటమార్చారని ఆరోపించారు. మున్నూరుకాపులలో ఐక్యతను దెబ్బతీయడానికే ట్రస్ట్ బోర్డు చైర్మన్ వ్యవహరిస్తున్నారని, ఆయనను పదవి నుంచి తొలగిస్తేనే ట్రస్ట్ బోర్డుకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహాసభ నాయకులు హనుమంతరావు, బి.ఆర్. జితేందర్, మణికొండ రమేష్‌కుమార్, కట్టెల సుభాష్, పెంటయ్య, నర్సింగ్‌రావు, కొంతం సురేష్‌బాబు పాల్గొన్నారు.


సోమన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాజీనామాను ఉపసంహరించుకున్న సోమన్

ముషీరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసే నాయకులకు పదవులు కేటాయించాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ హామీ ఇచ్చారు. సీనియర్ నాయకుడు టి. సోమన్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేయడంతో మంగళవారం ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాజీనామాను ఉపసంహరించుకున్నారు. ముఠాగోపాల్ సారథ్యంలో బీఆర్‌ఎస్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం సోమన్‌ను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ముషీరాబాద్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, వై. శ్రీనివాసరావు, నాయకులు ముఠా జైసింహ, డి. శివముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, ముషీరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ఎదురుకోళ్ళు

చిక్కడపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్‌లో ఆంజనేయస్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం ఎదురుకోళ్ళ కార్యక్రమం కనులపండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతకు ముందు హనుమత్ కార్యసిద్ధి హోమం ఈవో దేవనాథం పర్యవేక్షణలో జరిగింది.

మ్యాన్‌హోల్స్, నాలాల్లో చెత్తాచెదారం తొలగింపు


మ్యాన్‌హోల్స్‌లో చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నాలాలు, మ్యాన్‌హోల్స్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపు పనులను గాంధీనగర్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ సిబ్బంది మంగళవారం చేపట్టారు. కార్పొరేటర్ ఎం. పావని పనులను పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నాలాలు, మ్యాన్‌హోల్స్‌లో పేరుకుపోయిన చెత్తా, చెదారం తొలగింపు పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, బీజేపీ నేతలు వినయ్‌కుమార్, నర్సింగ్‌రావు, ఉమేష్, ఆకుల సురేందర్, నవీన్‌కుమార్, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా
20న గ్రేటర్‌లో సేవా కార్యక్రమాలు

రాంనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజును పురస్కరించుకొని ఈనెల 20న గ్రేటర్ హైదరాబాద్‌లో టీడీపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా, ప్రధాన కార్యదర్శులు బాల్‌రాజ్‌గౌడ్, నల్లెల కిషోర్ వెల్లడించారు. మంగళవారం దోమలగూడలో పార్టీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ నాయకులు కప్ప కృష్ణగౌడ్, ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చయ్యనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు


డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అచ్చయ్యనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ కె. రవిచారి అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి, న్యూఅచ్చయ్యనగర్ ప్రాంతాలలో ఆయన పాదయాత్ర చేశారు. డ్రైనేజీ సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వర్సిటీలతో రెడ్డి కళాశాల ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపిస్తున్న డాక్టర్ అచ్యుతాదేవి

బర్కత్‌పుర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వియత్నాంలో జరిగిన ఔషధ మొక్కలు, సహజ ఉత్పత్తులు అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రపంచంలోని ఐదు అంతర్జాతీయ యూనివర్సిటీలతో పరిశోధన ఒప్పందం చేసుకున్నట్లు రాజా బహదూర్ వెంకట్రామ్‌రెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్యుతాదేవి తెలిపారు. ఈ నెల 15, 16 తేదీలలో అంతర్జాతీయ సదస్సు జరిగిందని తనతో పాటు కళాశాలకు చెందిన డాక్టర్ రవికిరణ్ పాల్గొన్నారన్నారు.

హనాయ్ జాతీయ విశ్వవిద్యాలయం(వియత్నాం), మారనాథ క్రిస్టియన్ విశ్వవిద్యాలయం (ఇండోనేషియా), నేషనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ అగ్రికల్చర్ ఫుడ్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (ఫ్రాన్స్), మలేషియా విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. కళాశాల తరపున పరిశోధన పత్రాలు సమర్పించామన్నారు.

ఒక్కసారి ఎంపీగా గెలిపించండి

కాంగ్రెస్ సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్

ముషీరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎంపీగా ఒక్కసారి గెలిపిస్తే సేవ చేస్తానని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని, అన్ని వర్గాల ప్రజల మద్దతుతో విజయం సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ముషీరాబాద్ కషిష్ హాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గ బూత్ కమిటీల సమావేశం యువజన కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న దానం నాగేందర్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఒక్కరోజు కూడా ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు బస్తీల్లో తిరగలేదని ఆరోపించారు. సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. ఆయనకు రూ.70వేల కోట్ల బడ్జెట్ ఉన్నప్పటికీ అందులో రూ.10వేల కోట్లు కూడా వెచ్చించలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని అన్నారు.

కష్టపడేవారికి కాంగ్రెస్ పార్టీలో పదవులు వస్తాయనడానికి అనిల్‌కుమార్ యాదవ్ నిదర్శనం అని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి ఇందిరమ్మ కమిటీల్లో స్థానం లభిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘన విజయం సాధించి రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.


బూత్ కమిటీల సమావేశంలో మాట్లాడుతున్న దానం నాగేందర్

రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేసేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ముషీరాబాద్ నియోజకవర్గంలో 70వేల ఓట్ల మెజార్టీ దానం నాగేందర్‌కు రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆర్. కల్పనాయాదవ్, వాజీద్ హుస్సేన్, నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి గౌరీశంకర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సంగపాక వెంకట్, సీనియర్ నాయకులు జి. నాగభూషణం, మోహిన్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు నాయకులు కృషి చేయాలి

రాజ్యసభ సభ్యుడు డా. లక్ష్మణ్


ప్రచారంలో భాగంగా కరపత్రం అందజేస్తున్న డా. కె. లక్ష్మణ్

కవాడిగూడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ సూచించారు. మంగళవారం కవాడిగూడ డివిజన్‌లో గగన్‌మహల్, తాళ్లబస్తీ, అడ్వకేట్ కాలనీల్లో ఇంటింటికి వెళ్లి మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ రచనశ్రీ, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

ముషీరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఇంటింటికీ బీజేపీ పిలుపుమేరకు మంగళవారం ముషీరాబాద్ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం. నవీన్‌గౌడ్, బీజేవైఎం నగర కార్యదర్శి కుషాల్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జమాల్‌పురి నందు పాల్గొన్నారు.


అంబర్‌పేట ఎంసీహెచ్ కాలనీలో ప్రచారం చేస్తున్న నాగభూషణం చారి

అంబర్‌పేటలో నేతల ఇంటింటి ప్రచారం

అంబర్‌పేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బీజేపీ నేతలు అంబర్‌పేటలో మంగళవారం పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు దాసోజు నాగభూషణంచారి ఎంసీహెచ్ కాలనీలో కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసి కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

ప్రేమ్‌నగర్‌లో బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ మైలారం రాజు ఆధ్వర్యంలో మోదీ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు.


ముషీరాబాద్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

సికింద్రాబాద్‌లో కమలం జెండా ఎగరడం ఖాయం

నల్లకుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో రెండవసారి కమలం జెండా ఎగరవేయడం ఖాయం అని మాజీ కార్పొరేటర్ వనం రమేష్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం న్యూనల్లకుంటలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రధాని మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్ గౌడ్, తిరుమల, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.


నల్లకుంటలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ వనం రమేష్

అంబర్‌పేటకు కిషన్‌రెడ్డి చేసిందేమీ లేదు

- **లోక్‌సభ ఎన్నికల్లో పద్మారావుగౌడ్‌ను గెలిపించాలి**
- **ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**


కాచిగూడ బూత్‌స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

బర్కత్‌పుర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రిగా, ఎంపీగా జి. కిషన్‌రెడ్డి ఐదేళ్లలో అంబర్‌పేట నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆరోపించారు. ఒక్క ఉద్యోగం కూడా కిషన్‌రెడ్డి ఇప్పించలేదని, మళ్లీ ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం నారాయణగూడ తాజ్‌మహల్ హోటల్‌లో కాచిగూడ డివిజన్ బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు.

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డిది ప్రచారం ఎక్కువ.. అభివృద్ధి శూన్యమని ఎద్దేవా చేశారు. అంబర్‌పేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఏమి చేశారో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అంబర్‌పేట అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు.

కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎర్ర బీష్మాదేవ్, ప్రధాన కార్యదర్శి సదానంద్, నాయకులు బద్దుల ఓంప్రకాష్‌యాదవ్, రవీందర్‌యాదవ్, గెల్వయ్య, నాగేందర్ బాబ్జీ, బి. కృష్ణగౌడ్, సునీల్ బిడ్లాన్, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ ఎంపీ సీటు గెలిచి కేసీఆర్‌కు కానుకగా ఇస్తాం

నల్లకుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఎంపీ సీటు గెలిచి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ అధ్యక్షతన ధ్రువ హోటల్‌లో పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. నాయకులు ఎం.భూపతినాథ్, రవీందర్, భాస్కర్, మూర్తి, శేఖర్, నరేష్, యాదయ్య, ఇర్ఫానా సుల్తానా, స్వప్న తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న ఆర్. కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, రమేష్‌కుమార్, మహేష్ తదితరులు

కురుమ కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- **ఎంపీ ఆర్. కృష్ణయ్య**

బర్కత్‌పుర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని రంగాల్లో వెనుకబడిన కురుమ కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ హయాంలో మూసివేసిన ఉన్ని బోర్డును తక్షణమే పునరుద్ధరించాలన్నారు. మంగళవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి చిల్లంపల్లి రమేష్‌కుమార్, నగర ప్రధాన కార్యదర్శి సీహెచ్. మహేష్ ఆధ్వర్యంలో కురుమ సంఘం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ.. కురుమ కులస్థుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక ప్రకటించాలని, రెండు కార్పొరేషన్ల చైర్మన్లతోపాటు నామినేటెడ్ పోస్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కురుమ కులానికి చెందిన బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి కేటాయించాలన్నారు. గొర్రెల కాపరులకు ప్రత్యేక పెన్షన్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో కురుమ సంఘం నాయకులు దేవర శ్రీనివాస్, పెంటప్ప, చేవ మహేష్, అమృత, వి. రమేష్, బండారు విజయ్, కె. పాండు తదితరులు పాల్గొన్నారు.

చోరీ చేసిన వాహనాలతో విన్యాసాలు

- **సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు**
- **ఇద్దరి అరెస్ట్.. 9 ద్విచక్రవాహనాలు స్వాధీనం**


వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని

బేగంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వాహనాలతో విన్యాసాలు చేసి ఫేమస్ కావాలనుకున్నారు.. పలు రకాల వాహనాలతో విన్యాసాలు చేసి.. వాటిని వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. వీరు విన్యాసాలు చేసిన వాహనాలు చోరీ చేసినవని గుర్తించిన పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి తొమ్మిది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని, ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ రామయ్య, డీఐ మల్లేష్‌తో కలిసి వివరాలు వెల్లడించారు.

చాంద్రాయణగుట్ట షాహీన్‌నగర్‌కు చెందిన షేక్ ఇబ్రహీం(19), బేగంపేట ప్రాంతానికి చెందిన బాలుడు నగరంలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో పార్క్ చేసిన ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్నారు. దొంగిలించిన వాహనాల నంబరు ప్లేట్లను తొలగించి షాహీన్‌నగర్ శివారు ప్రాంతాల్లో విన్యాసాలు చేసేవారు. విన్యాసాలను వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపులలో పోస్టు చేస్తుండేవారు. బేగంపేటలో తన వాహనం చోరీ అయిందని స్మితాపటేల్ ఈ నెల 13న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు చోరీ అయిన వాహనాలను షాహీన్‌నగర్‌లో నంబరు ప్లేట్లు లేకుండా తిరుగుతున్నాయని గుర్తించారు. అడ్మిన్ ఎస్ఐ గంగాధర్ నేతృత్వంలో క్రైం పోలీసులు షాహీన్‌నగర్ వెళ్లి వాహనాలను స్వాధీనం చేసుకొని నిందితులు షేక్ ఇబ్రహీం, బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా.. వాహనాలను చోరీచేసి వాటి మీద విన్యాసాలు చేస్తూ ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో పోస్ట్ చేసి ఫేమస్ కావాలనుకున్నామని పోలీసులకు తెలిపారు. ఎస్సార్‌నగర్, సనత్‌నగర్, హుమాయున్ నగర్, రాంగోపాల్‌పేట, ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో వాహనాలను చోరీ చేసినట్లు విచారణలో తేలింది. నిందితుల నుంచి తొమ్మిది వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.


పురస్కార గ్రహీతలతో కోట శ్రీనివాసరావు తదితరులు

రంగస్థలం నుంచి సినీ నటుడిగా ఎదిగాను

- **కోట శ్రీనివాసరావు**

చిక్కడపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రంగస్థలం నుంచి సినీనటుడుగా ఎదిగి 783 సినిమాల్లో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందానని ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు తెలిపారు. వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో తెలుగు రంగస్థల దినోత్సవం సందర్భంగా ప్రముఖ రంగస్థల, టీవీ, సినీనటుడు సుబ్బరాయశర్మకు నాటక రచయిత, రంగస్థల ప్రముఖుడు తుర్లపాటి రామచంద్రరావును స్వర్ణవంశీ యలవర్తి రాజేంద్రప్రసాద్ జాతీయ జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోట శ్రీనివాసరావు పురస్కారాలు బహూకరించి మాట్లాడారు. సుబ్బరాయశర్మ తన నటన పురోగతికి పునాది వంటివారని, ఆయనతో పోటీపడాలనే కోరికతో తాను ఈ స్థాయికి వచ్చానన్నారు. రామచంద్రరావు గొప్ప నాటక ప్రయోక్త అని ప్రశంసించారు. సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, వంశీ రామరాజు, డా. తెన్నేటి సుధ, యలవర్తి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దంపతుల గొడవ.. భర్త ఆత్మహత్య

బర్కత్‌పుర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య గొడవతో మనస్తాపం చెందిన భర్త రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట శంకర్‌నగర్‌లో ఎన్. సుదర్శన్(63), సుజాత దంపతులు నివస్తున్నారు. సుదర్శన్ విశ్రాంత ఉద్యోగి. కొద్ది రోజుల నుంచి భార్యాభర్తలు గొడవపడుతున్నారు. మనస్తాపం చెందిన సుదర్శన్ మంగళవారం మలక్‌పేట-కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య తిలక్‌నగర్ బ్రిడ్జి సమీపంలో ఎంఎంటీఎస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

జువెనైల్ హోం నుంచి బాలిక పరారీ

బర్కత్‌పుర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జువెనైల్ హోం నుంచి ఓ బాలిక పారిపోయింది. కాచిగూడ ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్‌కు చెందిన బాలిక(17)ను ఓ కేసులో గత ఏడాది జనవరిలో కాచిగూడలో బాలిక సదన్‌కు తరలించారు. మంగళవారం మధ్యాహ్నం ఆమె గోడ దూకి పారిపోయింది. సదన్ సూపర్‌వైజర్ సావిత్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాధులు నయం చేస్తామని మోసం

- **ఆయుర్వేద ఔషధాల ముఠా అరెస్ట్**

అమీర్‌పేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి నయం చేస్తామని మోసాలకు పాల్పడుతున్న కర్ణాటక, నాగ్‌పూర్‌కు చెందిన నకిలీ ఆయుర్వేద ఔషధాల ముఠా సభ్యులు ముగ్గురిని మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఏసీపీలు వెంకటరమణ, మోహన్‌కుమార్ వివరాలు వెల్లడించారు. క్యాన్సర్, పక్షవాతం, చర్మవ్యాధులు, కిడ్నీ, అల్జీమర్, న్యూరో, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారిని ముఠా సభ్యులు గుర్తించేవారు. తమ ఇంట్లో సభ్యులకు కూడా ఈ తరహా సమస్య ఉండేదని, ఆయుర్వేద ఔషధం వాడితే తగ్గిపోయిందని నమ్మించేవారు. మందు కోసం తమకు తెలిసిన వైద్యుడిని సంప్రదించాలని ముఠాలో మరో సభ్యుడి ఫోన్ నంబర్ ఇస్తారు. తరువాత వైద్యులుగా చెప్పుకునే ముఠా సభ్యులు బాధితుల ఇళ్లకు వెళ్లి కొబ్బరి, ఆవ నూనె, కర్పూరం, యాలకులు, పసుపుతో చికిత్స మార్గాలను సూచిస్తారు. చికిత్సకు వాడే వస్తువులు తమకు తెలిసిన ఆయుర్వేద స్టోర్లలో మాత్రమే దొరుకుతాయని చెబుతారు. బాధితులకు నకిలీ ఆయుర్వేద మందుల దుకాణాల వివరాలు చెబుతారు. ఇంటికి వచ్చి చికిత్స చేసేందుకు, ఆయుర్వేద దుకాణాల్లో మందులు కొనుగోలు చేసేందుకు లక్షల్లో డబ్బు వసూలు చేస్తారు. నిందితులు నగరంలో 14 మోసాలకు పాల్పడ్డారు. బాధితుల నుంచి రూ. 19 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం.

జాతీయ స్థాయిలో బంగారు పతకానికి డాక్టర్ రేష్మ ఎంపిక



గోల్నాక, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జైస్వాల్ గార్డెన్ నివాసి వినోద్‌కుమార్, శారద దంపతుల కుమార్తె ఈఎన్‌టీ డాక్టర్ బహునూతల రేష్మ జాతీయ స్థాయిలో బంగారు పతకానికి ఎంపికయ్యారు. 2021లో జరిగిన నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్స్‌కు(ఎన్‌బీఈఎంఎస్) జాతీయస్థాయిలో నిర్వహించిన ఈఎన్‌టీ విభాగంలో డీఎన్‌బీ తుది పరీక్షలో మొదటి ర్యాంక్ సాధించి డాక్టర్ ఎస్. కామేశ్వరన్ బంగారు పతకానికి ఎంపికయ్యారు. ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన రేష్మ 2021లో కాళోజీనారాయణరావు ఆరోగ్య వర్సిటీ నిర్వహించిన పీజీ డిగ్రీ పరీక్షల్లో అన్ని స్పెషాలిటీస్‌లో టాపర్‌గా నిలిచారు. ఆమె ప్రస్తుతం కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. మే 10న న్యూఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతులమీదుగా రేష్మ బంగారు పతకం అందుకోనున్నారు. ఆమెకు జైస్వాల్ గార్డెన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.